

# మాటా మంతీ
## -సాయి పద్మ



**- 4 -**

# సన్మానాలూ —వీరతాళ్ళూ

కళ్ళు మూసి తెరిచేటంతలో మళ్ళీ నెల వచ్చేసి , నేనోచ్చేసానోచ్..!! ఇది ఏప్రిల్ మాసం ..ఎండ మొదలై మాడు మండింగ్స్ ..కదా, అయినా మన ఊళ్ళల్లో కలర్ షోడా లాంటి కబుర్లు కొన్ని చెప్దామని డిసైడ్ చేశా. మార్చి నెల అందర్నీ ఏమార్చే నెల, కట్టాల్సిన టాక్సూ , బిల్లులూ, ఇకపోతే ఇన్ కమ్ టాక్స్ , ఇంకా సుత్తి వీరభద్రరావు టైప్ లో , మన్నూ మశానం టాక్స్ .. ఇలాంటివన్నీ కట్టేసి , సరదాగా ఊపిరి పీల్చుకుందాం అనేలోగ..మా ఎన్జీవో లకి (అంటే నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ లేదా చారిటీ లేదా సంస్థ లు ) నడిపేవాళ్ళ కి కొత్త కష్టాలు వచ్చి పడతాయి.

మార్చ్ అయిపోతోంది కాబట్టి , అర్జంట్ గా ఉన్న ఫండ్ ఖర్చు పెట్టేద్దారి అనుకొనే గవర్నమెంట్ సంస్థల వాళ్లక , యమర్జంట్ గా గుర్తొచ్చేస్తారు సంస్థల వాళ్ళు, అత్తగారు పెట్టిన చీర కాదనలేని కోడల్లా “లేదండీ , మేము ఆ ఏరియా లో పని చేయటం లేదు” అనో, నాసిరకం చీర నచ్చకపోయినా పైకి తేలని ఆడపడుచులా ..” లేదండీ..ఇదే వర్క్ మేము చేసి ఉన్నాం , ఇప్పుడు ఇంత తక్కువ టైం లో చేయలేము , మాకు అంత కెపాసిటీ లేద”నో .. చెప్పి తప్పించుకొనే వాళ్ళు ధన్యులు. మిగతావాళ్ళు, సర్టిఫైడ్ బకరాలు.

అదే టైం లో అందరికీ గుర్తొచ్చేవి – చేయాల్సిన సన్మానాలూ, వేయాల్సిన వీరతాళ్ళూ..! నేనో లేదా నాలాంటి డిజేబుల్డ్ పర్సన్ ట్రావెల్ చేయాలంటే ఏం కావాలి ? ఇలా అనగానే నా మేనకోడలు గుర్తొచ్చి నవ్వొచ్చింది. అదో చిన్న పిట్ట కథ. చెప్పేసి విషయం లోకి వస్తానేం ? మా ఇంట్లో అందరికంటే లేట్ గా ( అయినా లేటెస్ట్ గా ) పెళ్లి చేసికున్నది నేను. మా తమ్ముడికి అప్పటికి ఇద్దరు ఆడపిల్లలు. దానికి ఏడేళ్ళు. చెప్పింది, “నీ పెళ్ళికి కావలసిన వస్తువులు నేను లిస్టు రాస్తాను “– అని. మా అందరికీ క్యూరియాసిటీ వచ్చి,” సరే రాయి” అన్నాము. ఒక పెన్ను పేపర్ తీసుకొని రాయటం మొదలెట్టింది. రాసేసి చాలా గొప్పగా మాకిస్తే, లిస్టు మొదట్లో “ ఒక పెళ్లి కొడుకు, ఒక పెళ్లి కూతురు “ అని ఉంది. ఇదేంటే ..అంటే వాళ్ళే కదా మరి ముఖ్యం అంది. మొదట్లో నవ్వొచ్చినా, నిజమే కదా అనిపించింది. బాపు గారు స్క్రిప్ట్ లా .. వేయి సూర్య కిరణాలు అనో ఏమో ఆయన స్క్రిప్ట్ లో రాస్తే కావాల్సిన వస్తువులు , అంటే సెట్ ప్రాపర్టీస్ –వేయి కిరణాలు అంటూ లిస్టు లో రాసుకున్నాడట అసిస్టెంట్ డైరక్టర్.

సరే పిట్ట కథ అయిపోయింది కదా.. నాలాంటి వాళ్ళు ట్రావెల్ చేయాలంటే ఏం కావాలి ? ఒక వీల్ చైర్ , నా అవసరాలు కనిపెట్టుకొనే ఒక మనిషి ( నా విషయంలో ఆ సర్టిఫైడ్ బకరా మావారు ) ఇండియాలో డిజేబుల్డ్ పర్సన్స్ అంటే ..పూర్తి స్థాయి శారీరకంగా ఆధారపడే మనుషులు. వెళ్ళే చోట ఏది ఎలా ఉంటుందో తెలీదు. బాత్రూం దగ్గరనుండీ బెడ్ రూమ్ దాకా. మెట్ల దగ్గరనుండీ లిఫ్ట్ దాకా ..!

ఇలాంటి పరిస్థితుల్లో, సన్మానాలూ, సత్కారాలూ, ఆ కాన్సెప్టే భలే విచిత్రంగా ఉంటుంది. దూరదర్శన్ అవార్డుకి విజయవాడ వెళ్లాను. ఏడు గంటలు కార్ లో.. మిగతా రెండు గంటలు కొత్త రాజధాని ట్రాఫిక్ లో. ఒకటే గాభరా.. బాత్రూం లోకి వీల్చైర్ వెళ్తుందో లేదో అని. అప్పటికే కొంతమంది సన్నిహిత మిత్రులు, ఒకటీ రెండు మెట్లు లేని హోటళ్ళు చెక్ చేసారు కూడా.

మొత్తానికి వెళ్లాం. వాష్ రూమ్ లోకి వీల్చైర్ వెళ్లిందని నేనూ మావారూ పండుగ చేసుకున్నాం. మర్నాడు అవార్డు కోసం వీల్చైర్ తీద్దామంటే అంది బిగుసుకుపోయింది. ఏంటి చెప్మా ఉప్మా అనుకుంటే, మొదటినుండీ కొంచెం ఇబ్బంది ఉంది, ఆ బ్రేక్ తో. వీల్చైర్ ని కార్ హుడ్ ( మీద ) పెట్టి , తాడుతో కట్టటం వల్ల బ్రేక్ బిగుసుకుపోయింది. ఇంక చూడాలి.. మా అవస్థ. ఒకవైపు వీల్ తిరుగుతోంది, మరోవైపు తిరగటం లేదు. ఎలాగోలా అవార్డు తీసుకున్నాం. ఇబ్బంది బయటపడకుండా , కొంచం మావారు, మా ఫ్రెండ్ సీతారాం గారు యధాశక్తి తోసి, ఆయాసం బయటపడనీయలేదు. వాళ్ళని మెచ్చుకొని క్షణం లేదు. అసలు అవార్డు రావాల్సింది ఇలాంటి వాళ్లకి. ఆరోజు అవార్డు అయిపోయిన తర్వాత నన్ను హోటల్లో దించి, నా ఆల్టర్ ఈగో నా వీల్చైర్ ని రిపేర్ చేయటానికి సీతారాం గారు, ఆనంద్ పడిన కష్టానికి చిన్న చిన్న సన్మానాలు చాలవు.

ఒకటే ప్రశ్న వస్తుంది, ఇలాంటి సపోర్ట్ సిస్టం లేని వాళ్ళ సంగతేమిటి? పని మానేయాలి. లేకపోతే పతంజలి చెప్పినట్టు, గుర్తింపు అనే దురద నీకు లేకపోతే, నిన్నెవరూ ఎక్కడికీ కదపలేరు, మోసం చేయలేరు. కానీ , విజిబిలిటీ అనేది కేవలం నీ మొబిలిటీ మీద ఆధారపడితే.. ? మనకి సపోర్ట్ ఉంటె, మనం ప్రపంచానికి కనబడతాం. లేకపోతే లేదు.

విజయవాడ తర్వాత ఢిల్లీ వెళ్ళాల్సి వచ్చింది. యునైటెడ్ నేషన్స్ వారి సహకారంతో, నడుస్తున్న ఒక అంతర్జాతీయ సేవా సంస్థ ఐకాంగో వారు నా సేవలను గుర్తించి కర్మ వీర్ చక్ర నేషనల్ సిల్వర్ మెడల్ అవార్డు ప్రదానం చేసారు. వాళ్ళు వివిధ రంగాలలో ఉన్న సేవ చేసే గ్రాస్ రూట్ లెవెల్ , అంటే ఫీల్డ్ లో పనిచేసే కార్యకర్తలను గుర్తించి ఈ అవార్డు ఇస్తారు. అవార్డు సంగతి వినగానే సంబరం వేసింది. ఇరవయ్యేళ్ళ నా వర్క్ ని గుర్తించినందుకు. కొంచం భయం కూడా వేసింది.. ఢిల్లీ లాంటి నగరానికి వెళ్ళాలి కదా.. అక్కడ అక్సెస్ ఎలా ఉంటుందో అని.

వెళ్లాం.. అవార్డు తీసుకున్నాం. దానికన్నా ముఖ్యంగా మాలా దేశంలో పని చేస్తూ, ఎంతో కొంత మార్పు తమ తమ రంగాలలో తెచ్చినవాళ్ళని చాలా మందిని కలిసాం. దాని గురించి మళ్ళీ వేరే చెప్తాను. ఒక ఎక్సైటింగ్ జర్నీ.

సన్మానం ఉంటె కొన్ని బాధల వీరతాళ్ళు కూడా ఉంటాయి. ఎంతో టేలెంట్ ఉంది, బయటకి రాలేని వికలాంగులని కలిసాను. వాళ్ళ గాధల్ని , మనసులోని బాధల్ని విన్నాను. శారీరకంగా వచ్చిన ఇబ్బందిని, ఎవరు ఎలా దాటతారు అనేది వారి వారి పరిస్థితులని బట్టి, అవకాశాల బట్టి, ఆటిట్యూడ్ బట్టి ఉంటుంది. వొప్పుకుంటాను. కానీ.. మొత్తం సిస్టం మిమ్మల్ని దృష్టిలో పెట్టుకోకుండా డిజైన్ చేయబడితే మొత్తం దేశమే పరాయిగా ఉంటుంది. రాత్రి పడుకొని లేవగానే నువ్వో పరాయి ఇంట్లో ఉంటె అక్కడే బ్రతకాల్సి వస్తే ఎలా ఉంటుందో , అచ్చం అలానే ఉంటుంది.

దేశపు రాజధానిలో పరిస్థితి అంతే.. చాలా మార్చాలి, చాలా చేయాలి ..జీవితం చాలదు అన్నప్పుడు బోల్డంత పని ఉన్నందుకు సంతోషం వేస్తుంది. కానీ, ఇంకా కత్తి గొప్పదా కలం గొప్పదా ? అనే డిబేట్ వింటే ఎంత చిరాకు వేస్తుందో. డిజేబుల్డ్ వాళ్ళు ఇది చేయగలరా

అది చేయగలరా .. అసలు అవసరమా అన్నది చర్చకి వచ్చినా అంతే చిరాకు వేస్తుంది. ఎవరు ఏం చేయగలరో, నిర్ణయించేది ఎవరు .. చేసేవాళ్ళా .. లేక చేసేది జస్ట్ చూసి జడ్జ్మెంట్ ఇచ్చేవాళ్ళా ?

ఢిల్లీ లో ఇదే ఆలోచిస్తూ టాక్సీ ఎక్కితే .. టాక్సీ డ్రైవర్ అన్నాడు, “ ఈ పెద్ద కార్ తీసుకున్నారు కాబట్టి కిలోమీటర్ ఇరవై రూపాయలు, లేకపోతే కిలోమీటర్ పది రూపాయలే అని..”

నేనన్నాను–“ మరి ఇదెందుకు తెచ్చారు ? ఇద్దరమే కదా వెళ్తున్నాం ?”

అతను చెప్పాడు – “ మీరే కదా వీల్చైర్ పట్టాలి అన్నారు “ నిజమే , డిజేబిలిటీ తాలూకా ఖర్చు ఇంతకంటే బాగా ఎవరూ చెప్పలేదు. సరిగా రెండింతలు ..!!

నాకో విషయం బోధపడింది. షుమారు ఇరవై వొక్క మిలియన్ల మంది వికలాంగులు ఉన్న ఈ దేశంలో ఒకళ్ళా ఇద్దరూ సాయి పద్మ లు చాలరు. వందల వేల సంఖ్యలో, ఉద్యోగాలలో, వ్యాపారాలలో, విహారాలలో, కనపడని ఈ శక్తి .. కనపడి , తమ హక్కులని అడగాల్సిన సమయం వచ్చింది!

స్వచ్ఛ భారత్ మాత్రమే కాదు... అందరూ మెచ్చే భారత్.. విదేశీయులు రావటానికి భయపడని భారత్ తయారవాల్సిన అవసరం వచ్చింది. కట్టిపడేసే వీరతాళ్ళు కాదు.. స్వేచ్ఛ నిచ్చే వాతావరణం.. విమర్శని విన్ విన్ గా మార్చుకొనే జవసత్వాలున్న వాతావరణం కావాలి.

lets make that in india ..!!

ఇంకొన్ని కబుర్లతో మళ్ళీ వచ్చే నెల ..!

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments